
వడ్యాట్-కమ్మర్‌పల్లి మధ్యలో పూర్తయిన బ్రిడ్జి నిర్మాణం

పాలెం శివారులో నిర్మించిన బ్రిడ్జి

వారధులు.. తీర్చిన వెతలు

- బ్రిడ్జిల నిర్మాణంతో దూరమైన ఇబ్బందులు
- సకాలంలో నిధుల మంజూరు, నిర్మాణాలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

మోర్తాడ్, డిసెంబర్ 6: భారీ వర్షాలతో కల్వర్టులు, బ్రిడ్జిలు తెగి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయి ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితులు ఉండేవి. గత ఏడాది వరకు ప్రతి వానాకాలంలో జరిగే తంతు ఇదే. కానీ ఈ సంవత్సరం భారీ వర్షాలు కురిసినా అలాంటి పరిస్థితులు ఎదురుకాలేదు. మంత్రిగా ఉన్న సమయంలో ప్రశాంత్‌రెడ్డి సకాలంలో స్పందించి అవసరమైన చోట బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతోపాటు పనులు త్వరితగతిని పూర్తి చేయించడమే ప్రధాన కారణం. మోర్తాడ్ మండలంలోని వడ్యాట్-కమ్మర్‌పల్లి, వడ్యాట్-మోర్తాడ్, మోర్తాడ్-బద్దంవాడ రోడ్డు, ధర్మోరా-శెట్‌పల్లి, తిమ్మాపూర్-పాలెం గ్రామాల మధ్య గత సంవత్సరం భారీ వర్షాలతో కల్వర్టుల వద్ద రోడ్డు తెగి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచాయి. ఈ విషయాన్ని గుర్తించిన అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి నిధులు మంజూరు చేయించడంతో పరిస్థితులు చక్కబడ్డాయి.

వేగంగా నిధులు.. చకచకా పనులు

గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలతో మోర్తాడ్ మండలంలో పలు గ్రామాల్లో కల్వర్టులు తెగిపోవడం, బ్రిడ్జిలు కోతకు గురయ్యాయి. పాలెం-తిమ్మాపూర్ గ్రామాల మధ్య, ధర్మోరా-శెట్‌పల్లి గ్రామాల మధ్య, వడ్యాట్-కమ్మర్‌పల్లి గ్రామాల మధ్య కల్వర్టులు తెగిపోయి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచాయి. మోర్తాడ్ బద్దంవాడలో బ్రిడ్జి వద్ద రోడ్డు కోతకు గురై బ్రిడ్జి శిథిలదశకు చేరుకున్నది. విషయం తెలుసుకున్న వేముల ప్రశాంత్‌రెడ్డి పరిస్థితులను సమీక్షించి వెంటనే పనులకు కావాల్సిన అంచనాలను తయారు చేయాలని అధికారులను ఆదేశించడం, నిధులు మంజూరు చేయించడం వేగంగా జరిగింది. మోర్తాడ్ బ్రిడ్జి మరమ్మతులకు రూ.2.60కోట్లు, శెట్‌పల్లి వద్ద బ్రిడ్జి నిర్మాణానికి రూ.50లక్షలు, తిమ్మాపూర్, పాలెం గ్రామాల మధ్య బ్రిడ్జిలు నిర్మాణానికి రూ.60లక్షలు, వడ్యాట్-కమ్మర్‌పల్లి గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణానికి రూ.30లక్షలు మంజూరు చేయించారు. నిధులు మంజూరు కావడంతో పనులు కూడా చకచకా పూర్తయ్యాయి. దీంతో ఈ సంవత్సరం భారీ వర్షాలు కురిసినా ఎలాంటి ఇబ్బందులు రాలేదు.

శెట్‌పల్లి శివారులో నిర్మించిన బ్రిడ్జి

శెట్‌పల్లి శివారులో గత సంవత్సరం కోతకు గురైన కల్వర్టు

పాలాలకు వెళ్లే దారిలో బ్రిడ్జి నిర్మాణం

బద్దంవాడ నుంచి పొలాలకు వెళ్లే రోడ్డులో కల్వర్టు కావాలని కోరితే ఏకంగా రూ.90లక్షలు మంజూరు చేసి బ్రిడ్జి నిర్మించేలా వేముల ప్రశాంత్‌రెడ్డి చూశారు. ఇది బద్దంవాడ రైతులం ఊహించనిది. కల్వర్టు కావాలంటే ఏకంగా బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం ఎంతో సంతోషమనిపించింది. గతంలో ఎంతమందికి చెప్పినా పట్టించుకోలేదు. కానీ ఒక్కమాటతో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు ఆయనకు రుణపడి ఉంటాం.

- జేసీ గంగారెడ్డి, రైతు, మోర్తాడ్

పనులు పూర్తవ్వడం సంతోషకరం

గత సంవత్సరం కురిసిన భారీవర్షాలతో బద్దంవాడ బైపాస్‌రోడ్డుపై ఉన్న బ్రిడ్జి దెబ్బతిన్నది. విషయం తెలుసుకున్న అప్పటి మంత్రి ప్రశాంతిరెడ్డి రూ.2.60కోట్లు మంజూరు చేయడంతోపాటు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూశారు. దీంతో రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అయ్యాయి. సకాలంలో స్పందించి నిధులు మంజూరు చేయడంతోపాటు పనులు పూర్తయ్యేలా చూసిన ప్రశాంతిరెడ్డికి మోర్తాడ్ ప్రజల తరఫున కృతజ్ఞతలు.

- బోగ ధరణి, సర్పంచ్, మోర్తాడ్

ఇబ్బందులు దూరమయ్యాయి

గత సంవత్సరం వర్షాలతో కల్వర్టుల వద్ద రోడ్డు కోతకు గురై తిమ్మాపూర్, పాలెం మధ్య రాకపోకలు బంద్ చేసింది. కోతకు గురైన కల్వర్టుల వద్ద బ్రిడ్జీలు కట్టడంతో ఈసారి భారీ వర్షాలు పడ్డా ఎలాంటి ఇబ్బంది రాలేదు. రెండు బ్రిడ్జీలను కట్టిన ఎమ్మెల్యే వేములకు కృతజ్ఞతలు.

- కుమ్మరి సిద్ధయ్య, పాలెం

తాను సాగుచేస్తున్న వంకాయ తోటను చూపుతున్న రైతు బానోత్ ధన్‌సింగ్

కూరగాయలతో నెలకు రూ.60వేలు

- ఎకరంన్నర భూమిలో వివిధ రకాల కూరగాయల సాగు
- నెలకు రూ.50వేల నుంచి రూ.60వేల వరకు ఆదాయం
- ఆదర్శంగా నిలుస్తున్న ఒడ్డపల్లి రైతు

ఎడపల్లి, డిసెంబర్ 6: రైతులకు ప్రతి రోజూ ఆదాయాన్నిచ్చే పంటలు కూరగాయలు. ప్రణాళికాబద్ధంగా దఫదఫాలుగా వివిధ రకాల కూరగాయ పంటలను విత్తుకుంటూ ఉంటే ఏడాది పొడవునా ప్రతి రోజూ అనేక రకాల కూరగాయలు చేతికి అందివస్తాయి. రైతు కుటుంబం తినొచ్చు.. అమ్ముకొని ఆదాయమూ పొందవచ్చని చెబుతున్నారు ఒడ్డపల్లి రైతు ధన్‌సింగ్. తనకు నాలుగు ఎకరాల భూమి ఉండగా మొదట వరి పంట సాగు చేశారు. ఆశించిన లాభాలు రాకపోవడంతో 15ఏండ్లుగా కూరగాయల సాగుపై దృష్టి సారించారు. రెండున్నర ఎకరాల్లో వరి పంట వేసి, మిగిలిన ఎకరంన్నర భూమిలో వివిధ రకాల కూరగాయలు సాగు చేస్తున్నారు. 30 గుంటల భూమిలో బెండకాయ, మరో 30 గుంటల్లో వంకాయ పండిస్తున్నారు. కూరగాయలను నిజామాబాద్ మార్కెట్‌తోపాటు ఎడపల్లి వీక్లీ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. దశల వారీగా చేతికి అందేలా కూరగాయలను సాగు చేయడం గమనార్హం.

> మారుతున్న కాలానికి అనుగుణంగా పంటల సరళిని మార్చుతున్నారు రైతులు. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటలను సాగు చేసి అధిక లాభాలు గడిస్తున్నారు. ఈ కోవలోకే వస్తారు నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం ఒడ్డపల్లికి చెందిన రైతు బానోత్ ధన్‌సింగ్.

ఆదాయం బాగు..

కూరగాయలు సాగు చేయాలంటే ఎక్కువ శ్రమ అవసరమే. ఇందుకోసం కూలీలను పెడితే వచ్చిన ఆదాయంలో సగం వారికే వెళ్తుందని గ్రహించాడు ధన్‌సింగ్. దీంతో భార్య వాలి, ఇద్దరు కుమారులైన ప్రేమ్‌సింగ్, బన్సి సహకారం తీసుకుంటున్నారు. బెండకాయ, వంకాయ పంటలను సాగు చేస్తూ మంచి ఆదాయాన్ని పొందుతున్నాడు. బెండకాయలను రోజు విడిచి రోజు కోసి ఎనిమిది పెట్టెలను నిజామాబాద్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఒక్కో పెట్టెలో 18 నుంచి 20 కిలోల వరకు తూగుతున్నాయి. మార్కెట్‌లో బెండకాయల ధర కిలో రూ.40 పలుకుతుండడంతో మూడు రోజులకు రూ.3వేల వరకు ఆదాయం వస్తున్నది. వంకాయలను వారానికి రెండు సార్లు కోస్తుండగా, సుమారు ఎనిమిది పెట్టెలను మార్కెట్‌కు తరలిస్తున్నారు. పెట్టెలో 18 నుంచి 20 కిలోల వరకు తూగుతున్నాయి. వీటి ధర కిలో రూ.40కి పైగా విక్రయిస్తున్నారు. కార్తిక మాసం పురస్కరించుకొని మార్కెట్‌లో కూరగాయలకు డిమాండ్ నెలకొనడంతో గిట్టుబాటు ధర లభిస్తున్నది.

కూరగాయలే బెటర్..

కూరగాయల సాగులో మెలకువలు పాటిస్తే వరి కన్నా ఎక్కువ లాభాలు పొందవచ్చు. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే వరిలో అధికంగా నష్టాలు వస్తాయి. కూరగాయల సాగుతో అంతగా నష్టాలు ఉండవు. మా కుటుంబసభ్యులుమంతా కష్టపడుతున్నాం. లాభాలు పొందుతున్నాం. పంట పెట్టుబడి ఖర్చులు పోను 8 నెలల్లో వంకాయ, బెండకాయపై రూ.4లక్షలకు పైగా ఆదాయం సమకుర్చుకుంటున్నాం.

- బానోత్ ధన్‌సింగ్, రైతు, ఒడ్డపల్లి, ఎడపల్లి మండలం

చలికాలం.. నారుమడి పైలం

- మొక్కకు పోషకాలు అందేలా చూడాలి
- రైతులకు శాస్త్రవేత్త డాక్టర్ స్వప్న సూచన

రుద్రూర్, డిసెంబర్ 6: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రైతులు ప్రధానంగా పండించే పంట వరి. వరి పండించడంలో రైతులకు పూర్తి అవగాహన ఉన్నప్పటికీ మితిమీరిన తెగులు సోకడంతో నష్టపోవాల్సిన పరిస్థితి వస్తున్నది. నారుమడి వేసిన నాటి నుంచి కోత కోసే వరకు మందులు పిచికారీ చేయాల్సి వస్తున్నది. ముందస్తుగానే రైతులు నారుమడి సాగులో తగు జాగ్రత్తలు తీసుకుంటే తెగుళ్ల బారినుంచి తప్పించుకునే అవకాశం ఉన్నదని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో నారుమడిలో చలి తీవ్రతను అధిగమించడానికి సాయంత్రం వేళల్లో నీరు పెట్టి ఉదయం తీసేయ్యాలి.
- నారుమడికి వెచ్చదనాన్ని అందించేందుకు కోళ్ల ఎరువు లేదా గొర్రెల ఎరువు, వర్మి కంపోస్టును వాడితే మంచిది.
- తీవ్రస్థాయిలో చలితీవ్రత నుంచి నారుమడిని రక్షించడానికి ఒక అడుగు ఎత్తులో వెదురు బొంగులు పాతి వాటిపై ప్లాస్టిక్ షీట్లను రాత్రిపూట వేసి ఉదయం తొలగించాలి.
- చలికాలంలో పోషకాలు సరిగ్గా అందక కొన్నిసార్లు జింకు లోపంతో ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడుతాయి. జింక్ లోపం నివారించేందుకు జింక్ సల్ఫేట్ 2గ్రా. లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- ఎకరానికి సరిపడే రెండు గుంటల నారుమడికి 2కిలోల నత్రజని రెండు దఫాలుగా 6.25కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ లేదా 2కిలోల డీఏపీ, 1కిలో పొటాష్‌నిచ్చే ఎరువులను వాడితే చలి తీవ్రత నుంచి నారు మడులను కాపాడుకోవచ్చు.

అధికారుల సలహాలు పాటించాలి

ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని నారుమడుల్లో సాయంత్రం వేసిన నీటిని ఉదయం తొలగించాలి. చలి తీవ్రత నుంచి నారుమడిని కాపాడుకోవడానికి శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకుంటే మంచిది. నారుమడికి కావాల్సిన వెచ్చదనం అందించే ఎరువులను వాడుకుంటే ఫలితం ఉంటుంది.

- డాక్టర్ స్వప్న, కేవీకే శాస్త్రవేత్త

వరినారుకు ఎరువు వేస్తున్న రైతు

తెగులు సోకడంతో రంగుమారిన వరినారు

వరి కొయ్యలను కాల్చొద్దు..

- అవగాహన లేమితో కాల్చుతున్న రైతులు
- భూమిలో కలియదున్నితేనే లాభం
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

వరి పంటను రైతులు గతంలో కొడవళ్లతో మొదళ్ల వరకు కోసేవారు. పశువుల పెంపకంపై కూడా రైతులు మక్కువ చూపేవారు. దీంతో వరి గడ్డిని కుప్పలుకప్పులుగా పశుగ్రాసం కోసం నిల్వచేసేవారు. ప్రస్తుతం సాగు విధానంలో అనేక మార్పులొచ్చాయి. పశువుల సంఖ్య తగ్గిపోవడంతో యంత్రాలను విరివిగా వినియోగిస్తున్నారు. హార్వెస్టింగ్ చేసే సమయంలో పైకి కోయడంతో కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయి. అవసరమున్న రైతులు కొంత గడ్డిని కోసి తీసుకెళ్తున్నారు. మిగిలిన దానిని అక్కడే వదిలేస్తున్నారు. మళ్లీ దుక్కి దున్నే సమయంలో నాగళ్లకు అడ్డుగా వస్తున్నాయని రైతులు వరికొయ్యలతోపాటు గడ్డిని కూడా కాలబెడుతున్నారు. దీంతో అధిక నష్టాలు వచ్చే అవకాశమున్నదని, వరి కొయ్యలను తగులబెట్టొద్దని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

- మాక్లూర్, డిసెంబర్ 6

పంట పొలాల్లో వరి కొయ్యలను తగలబెట్టిన రైతులు

వరి కొయ్యలను కాలిస్తే పర్యావరణ కాలుష్యం ఏర్పడడంతోపాటు పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు నశిస్తున్నాయి. సారవంతమైన భూమి దెబ్బతింటున్నది. రైతులు చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే వరి కొయ్యల మిగులు అవశేషాలతో సిరులు సంపాదించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వరి కోత అనంతరం ఉండే గడ్డిని పశువులకు వాడడం లేదా కంపోస్టుగా మార్చుకోవాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

కొయ్యలను కాల్చడంతో అనర్థాలు..

పొలంలో కొయ్యలను కాల్చడం అత్యంత ప్రమాదకరస్థాయికి చేరుకున్నదని శాస్త్రవేత్తలు, సామాజికవేత్తలు అందోళన వ్యక్తంచేస్తున్నారు. రైతులు అవగాహన లేమితో పంటకు ఎంతో మేలు చేసే కొయ్యలను భూమిలో కలియదున్నకుండా కాల్చివేసి భవిష్యత్ పంటలను నాశనం చేస్తున్నారని, వాతావరణాన్ని తీవ్రంగా కలుషితం చేస్తున్నారని చెబుతున్నారు. కొయ్యలను కాల్చివేసే క్రమంలో భూమి గట్టిపడుతున్నదని, పొలాన్ని కలియదున్నడం వీలుకాదని పేర్కొంటున్నారు. కొయ్యలను కాల్చివేయడంతో భూమిలో ఉన్న సూక్ష్మజీవులు, వానపాములు నాశనమవుతున్నాయని, దీంతో భూమి గుల్లగా మారే పరిస్థితి ఉందని చెబుతున్నారు. నాట్లు వేసిన వేర్లకు సరిగ్గా పోషకాలు చేరవని, పైరు పెరగదని వివరిస్తున్నారు. రైతులు ఎక్కువగా యూరియాను వినియోగించాల్సి వస్తున్నదని, కానీ దాన్ని స్వీకరించి వేర్లకు అందించే సూక్ష్మజీవులు అప్పటికే అంతరించిపోవడంతో ప్రయోజనం లేకుండా పోతున్నదని పేర్కొంటున్నారు. ఇదే సమయంలో యూరియాను అతిగా వాడడంతో భూమిలోకి చేరి భూగర్భ జలం విషతుల్యమవుతుందని, వాతావరణంలో అనేక మార్పులు కలుగుతాయని చెబుతున్నారు. కార్బన్ డై ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోకార్బన్ గాలిలో కలిసి వాతావరణం, జీవకోటిపైన తీవ్ర ప్రభావం చూపుతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

కలియదున్నితేనే లాభం..

పంట కోసిన వెంటనే వరి కొయ్యలను కాల్చకుండా పొలంలోనే కలియదున్నాలి. దీంతో కొయ్యలు మట్టితో కప్పబడి కుళ్లే ప్రక్రియ ప్రారంభమవుతుంది. తర్వాత సేంద్రియ ఎరువుగా మారుతుంది. వరి కొయ్యలను కలియదున్నడం, కుప్ప చేయడంతో నేలల్లో పగుళ్లు రాకపోవడం, తేమ ఆవిరి కావడం తగ్గి భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. కొయ్యలను కలియదున్ని వెంటనే కళ్లి పోయేలా పొటాషియం చల్లితే సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది. తదుపరి పంటకు పోషకాలు విపరీతంగా పెరుగుతాయి.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం..

వరి కొయ్యలు కాల్చకుండా కలియదున్నుకోవాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. కలియదున్నితే భూ సారం పెరుగుతుంది. భూమిలోని సూక్ష్మజీవులు నశించవు. పర్యావరణం దెబ్బతినదు. వరి కొయ్యలను కలియదున్నితే భూమికి కాంపెక్స్ ఎరువులతో సమానంగా సేంద్రియ ఎరువుగా పని చేస్తుంది. గ్రామాల్లో రైతులకు వరి కొయ్యల కాల్చివేతతో కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్నాం.

- పద్మ, వ్యవసాయాధికారిణి, మాక్లూర్